అమృతకిరణ్ కథలపోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ (250/-)

# స్థాయీ భేదం

## ఘండికోట బ్రహ్మాజీరావు

కాత్యాయని కాలేజీనుంచి తిరిగొచ్చేసరికి పెళ్ళిచూపులకు వచ్చిన వాళ్ళు అప్పటికే అరగంటనుండి ఆమెకోసం ఎదురుచూస్తున్నారు. ఆమెకు... తను ప్రత్యేకంగా ముస్తాబు కావడానికి అవకాశం లేకపోయింది.

అయినా కాత్యాయనికి ముస్తాబు దేనికి? చారెడు కళ్ళూ, విశాలమయిన ఫాలం, పొడవాటి జడ, మొదటిసారి ఆమెను చూసినవాళ్ళు ఆమె సౌందర్యానికి మంత్ర ముగ్ధులయిపోతారు!

కాత్యాయనికి పెళ్ళి చూపుల సంగతి తెలియదు. ఆఖరి పిరియడ్‌లో పనిలేదని లైబ్రరీలో పుస్తకాలు తిరగేస్తూ కూర్చుంది.

శాస్త్రిగారు మధ్యాహ్నం రెండుగంటలకు వచ్చారు. వాళ్ళ రెండో అబ్బాయి ఇంజనీరింగ్ పరీక్షలు పాసయి, టౌన్ ప్లానింగ్ ఆఫీసరుగా అయిదేళ్ళనుండి పనిచేస్తున్నారు. ఇద్దరు చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళయిన తరువాత తన పెళ్ళికి ఒప్పుకున్నాడనీ రఘురామయ్యగారితో చెప్పారు.

పిల్లాడు మంచిఉద్యోగమే చేస్తున్నాడు. ఇల్లూ, వాకిలీ ఉన్నాయి. చూడటానికి కూడా బాగుంటాడు. కాత్యాయనికి సరిపడిన వయసే. ఇవన్నీ రఘురామయ్యగారు భార్యతో ఆలోచించి ఏ కబురూ చేస్తానన్నారు! కానీ ఈ విషయం కాత్యాయనికి చెప్పేలోపునే శాస్త్రిగారి కుటుంబం పెళ్ళి చూపులకు వచ్చింది.

కళ్యాణం కలిసి వస్తే ఇటువంటి పనులే జరుగుతూంటాయని జానకమ్మ కూతురికి బోధపరిచి పెళ్ళి చూపులకు కూర్చోబెట్టింది.

పెళ్ళి కొడుకు అట్టే మాట్లాడలేదు.

పెళ్ళికొడుకు తల్లి కాత్యాయనిచేత మాట్లాడించింది. పిల్లకి మూగా, నత్తీ ఉందేమోనని అలా చేశానని ఆమె అంది. పెళ్ళికొడుకు కొంచెం చిరాకుపడి అన్నాడు.

"కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేస్తోన్న అమ్మాయికి మాటలు రాకపోతే ఎలా?"

"సంగీతమొచ్చా?" పెళ్ళికొడుకు చెల్లెలు ప్రశ్న వేసింది.

"చాలాసార్లు ఈమె వీణ కచేరీలు చేసింది అందుచేత సంగీతం వచ్చినట్లే అన్నాడు" పెళ్ళికొడుకు.

"నాకీ సంగీతాలూ, చదువులూ అక్కరలేదు. నా ప్రశ్నలేవో తెలుసా? వంటా వార్పూ వచ్చా? ఇల్లు దిద్దుకోగలదా? అన్నిటికన్నా ముఖ్యం నలుగురున్న ఇంట్లో కలిసి ఉండగలదా?" పెళ్ళికొడుకు తల్లి అడిగింది.

"అన్నీ తెలిసిన పిల్ల మరేం ఫరవాలేదు." అంది జానకమ్మ.

"చూడండి వదినగారు! మా కుర్రాడు మంచి ఉద్యోగం చేస్తున్నాడు. వాడికి చాలా మంది పెద్ద పెద్ద వాళ్ళు స్నేహితులున్నారు. పెళ్ళికి అయిదువందల మంది వస్తారు. వాళ్ళకు ఏలోటూ రాకుండా చూసుకోవాలి."

దానికి జానకమ్మ తలూపింది.

"వదినగారూ! మా వాడికి రెండు, మూడు సంబంధాలొచ్చాయి. ఒకరు రెండు లక్షల కట్నమంటే, మరొకరు మూడు లక్షలన్నారు. మీతో వియ్యమందాలని మావారి కోరిక. కాబట్టి ఒక లక్షకు తక్కువ కాకుండా ఇవ్వాలి. లాంఛనాలు మరో ఏభైవేలు."

దీనికి కూడా జానకమ్మ అంగీకరించింది.

పళ్ళూ, స్వీట్లూ, పూలూ తేవడానికి బజారుకు వెళ్ళిన రఘురామయ్యగారు రావడం కొంచెం ఆలస్యమయింది. తన మెడలోని నగలను ప్రదర్శించి, తాను చెప్పవలసిన గొప్పలన్నీ చెప్పి, పెళ్ళికొడుకు తల్లి ఈ సమయాన్ని బాగా వినియోగించుకొంది.

ఆమె తను ఆస్తి పాస్తుల గురించీ, సంపద గురించీ చెప్పింది. వాళ్ళున్న ఇల్లు అందరికీ తెలిసిందే! అందులో రెండో అంతస్థును పెళ్ళికొడుకు తన కోసమే కట్టించుకున్నాడు. అతని దగ్గరికి తరచూ పార్టీలు వస్తుంటాయి.

వారితో మాట్లాడటానికి ఒక గదీ, అటాచ్‌డ్ బాత్‌తో పెద్ద బెడ్‌రూము ఆ రెండో అంతస్థులో ఉన్నాయి.

అది బెడ్ రూము కాదు. సినిమా సెట్టింగ్‌లకు మించిన హంగులున్నాయి దానికి. అన్నీ ఆధునికమైన ఫిట్టింగులు, ఫర్నిచరు, ఫోమ్ పరుపులు, ఛాందినీలు, నేలను పరిచే తివాసీలు వైభవంగా రాబోయే భార్యకోసం అలంకరించాడు.

వాళ్ళింట్లోకి అడుగు పెట్టిన కోడలు మెడ తిరగకుండా నగలు పెట్టుకుని, పనసపళ్ళలాంటి బిడ్డలను కంటుంది. ఇంతకన్నా ఆడపిల్లకేం కావాలి?

ఈ విషయాలన్నీ కాత్యాయని మనసులో తెరమీద బొమ్మల్లా కదులుతున్నాయి. మాటలన్నీ చెవుల్లో గింగురు మంటున్నాయి.

రఘురామయ్యగారు బజారునుండి వచ్చిన కొద్ది సేపట్లో తతంగమంతా ముగిసింది. పిల్ల నచ్చిందని పెళ్ళికొడుకు తల్లి చెప్పింది. జాతకాలు కూడా సరిపోయాయి.

తొందర్లోనే ముహూర్తాలు పెట్టిస్తామన్నారు. పెళ్ళికి అన్ని ఏర్పాట్లూ చేయమని చెప్పి వాళ్ళు వెళ్ళబోతూంటే, కాత్యాయని ఒక్క మాటంది.

"ఆలోచించుకోడానికి నాకో వారం రోజులు గడువివ్వండి."

"దానికేం! మహారాజులా ఆలోచించుకో, కోరి వచ్చిన మంచి సంబంధం ఎవరు కాదంటారు?" అంది పెళ్ళికొడుకు తల్లి.

రేపు సోమవారం. ఉదయమే కాత్యాయని తన నిర్ణయం తల్లిదండ్రులకు తెలియచేయవలసి ఉంది.

కాత్యాయనికి ఆడంబరాలు సరిపడవు. పెద్దింటి పిల్ల. ఎవరితో మాట్లాడినా వినయంగా వ్యవహరిస్తుంది. కాలేజీలో అమ్మాయిలకు పాఠం చెప్తూంటే వాళ్ళందరూ తన్మయులై వింటారు.

నాలుగు సంవత్సరాల క్రితం ఉద్యోగంలో చేరింది. అటు విద్యార్థినులకూ, ఇటు తోటి లెక్చరర్లకూ ఆమె తలలో నాలుకయింది.

ఆమె తీరిక దొరికనప్పుడు స్టూడెంట్స్‌తో 'చాలా డబ్బు వృధాగా ఖర్చుచేస్తున్నామనీ, పాత



ఆచారాలను కొంచెం సవరించి తక్కువ ఖర్చులో పెళ్ళిళ్ళు చేసుకుంటే బాగుంటుంద'ని చెప్పేది. అలాంటది వెళ్ళేటప్పుడు పెళ్ళికొడుకు తల్లి అన్నమాటలు ఆమెకే సవాల్‌గా నిలిచాయి.

పెళ్ళిచూపులైన మూడోరోజున, ప్రిన్సిపాల్ గారు ఒంటరిగా తన గదిలో ఉన్నప్పుడు కాత్యాయని ఆమెను చూడడానికి వెళ్ళింది.

"నన్ను రమ్మని అటెండరుతో కబురు పంపించారు మేడమ్! ఏదైనా విశేషమా?"

"కాత్యాయనీ! కూర్చో! కాలేజీలో కొత్త భవనాలు కట్టడానికి ప్లాన్లు తయారుచేసి మున్సిపల్ ఆఫీస్‌కు పంపాం. నిన్నటౌన్ ప్లానింగ్ ఆఫీసరుగారు వచ్చి ఒక అరగంటసేపు నాతో అన్ని విషయాలూ మాట్లాడారు. అప్పుడాయన ఒక సంతోషకరమైన విషయం చెప్పారు. నిన్ను ఆయన పెళ్ళాడుతున్నారట!"

కాత్యాయని నవ్వి ఊరుకుంది.

"అంతేకాకుండా, పెళ్ళయిన మరుక్షణమే, నీచేత లెక్చరరు ఉద్యోగానికి రాజీనామా ఇప్పిస్తానన్నారు. ఈ సంగతి తలచుకుంటే నాకు కష్టంగా ఉంది. నువ్వంటే స్టూడెంట్స్‌కి చాలా గౌరవం. ఈ నష్టం కాలేజీకే కాక, విద్యార్థినులకు కూడా వర్తిస్తుంది.

కాత్యాయని కుర్చీలోంచి లేచి, తలవంచుకొని వెళ్ళిపోయింది.

ఆ తర్వాత కాత్యాయని గీతామందిరానికి వెళ్ళింది. అక్కడే గానసభలూ, కచేరీలు జరుపుతూ

ఉంటారు. మరొక్క పదిహేను రోజులలో ఆమె అక్కడ వీణా కచేరి చేయవలసి ఉంది.

సెక్రటరీ వేణు ఒక్కడే ఆఫీసులో ఉన్నాడు. అతనికి నమస్కారం పెట్టి, ఎదురుగా ఉన్న కుర్చీలో కాత్యాయని కూర్చుంది.

"కాత్యాయనిగారూ! వచ్చేనెల పదో తారీకున జరగవలసిన మీ ప్రోగ్రాం రద్దయింది."

"కారణం?"

"టౌన్ ప్లానింగ్ ఆఫీసరుగారు పనిమీద నిన్న ఇక్కడికి వచ్చారు. మీ కచేరి గురించి అంటించిన పోస్టరు చూసి మండిపడ్డారు. మరో పది రోజుల్లో మిమ్మల్ని పెళ్ళాడుతున్నారట. గాన సభలూ, వీణా వాద్యాలు తనకు సరిపడవనీ, ఈ ప్రోగ్రాము జరిగేది కాదనీ, వెంటనే దీనిని రద్దు చేసి ప్రెస్‌కి తెలియచేయమనీ చెప్పారు."

శనివారం సాయంకాలం, కాత్యాయని ఇంటికి బయలుదేరుతూంటే కాలేజీ అటెండరు కలిశాడు.

"నేను ఇవాళ పొద్దున్న శాస్త్రిగారింటికి యజ్ఞోపవీతాల కోసం వెళ్ళవలసి వచ్చింది. ఆయన ఏదో పని మీద ఉంటే, ఒక పావుగంట వరకు వీధి గదిలో కూర్చున్నాను. ఆ ఇల్లో సంతబజారులా ఉంది. అందరూ సినిమా డైలాగులే పలుకుతున్నారు. వాళ్ళందరి మధ్యా, కాబోయే పెళ్ళి కొడుకు కూర్చొని వాళ్ళ మాటలకు తెగమురిసి పోతున్నాడు. మీరు ఆ ఇంటి కోడలిగా వెళ్తున్నారంటే నాకు బాధగా ఉంది మేడమ్!"

ఆ రాత్రి... కాత్యాయని తనగది కిటికీలోంచి చూస్తూనించుంది. పాదరసం వరదలా వెన్నెల పెరటిని కప్పేసింది!

సన్నజాజి పందిరి నుండి అహ్లాదమైన సువాసన... గాలిలో తేలి లోపలికి వస్తోంది!

ఆమె ఆలోచిస్తోంది!

తొందర్లో ఈ గదినీ... ఈ ఇంటినీ... ఈ పెరటినీ విడిచి ముక్కూ, ముఖం తెలీని వ్యక్తితో వెళ్ళిపోవాలి! పెళ్ళయిన తర్వాత ఆడపిల్లలు ఎన్నాళ్ళు తమ పుట్టిళ్ళలో ఉండిపోతారు?

తన తల్లీ, మామ్మగారూ అందరూ అలా వచ్చిన వాళ్ళే....

తను కూడా...

ఈ ఆలోచన వచ్చేసరికి ఆమెకు మనసంతా బరువెక్కిపోయింది.

మరి తన తల్లి ఎప్పుడూ తనలా ఫీలవలేదే! అది నాన్నగారి గొప్పతనమా...

పెళ్ళికి ముందే అతడి స్వరూపం తెల్సిందన్న సంతోషమా... నిర్లిప్తమా...

ఆలోచిస్తూ ఎప్పుడు నిద్రపోయిందో ఆమెకే తెలీదు.

మర్నాడు...

ఉదయం... పక్షుల కిలకిలా రావాలకు కళ్ళు విప్పిన కాత్యాయనికి కిటికీల్లోంచి - పెరట్లో - జామపళ్ళనీ - బాదం పళ్ళనూ పొడిచి తింటూ గోల చేస్తోన్న రంగు రంగుల పక్షులు కన్పించాయి!


రోజూ ఇవే కదూ తనకు మేల్కొలుపులు పలికేవి!

ఆమె ఏదో నిశ్చయానికి వచ్చింది!

రేపటినుండి... తనూ... తన కాలేజీ... తన విద్యార్థినులూ... తన పుస్తకాలూ...అంతా మామూలే!

★

## ఇంటివాడైన రెహమాన్



27 ఏళ్ళ వయసులోనే దేశ వ్యాప్తంగా గుర్తింపును తెచ్చుకుని సంచలన సంగీత దర్శకుడయ్యాడు ఏ.ఆర్.రెహమాన్. జన్మతఃహిందూనే అయినా ముస్లిం మతాన్ని స్వీకరించి, దిలీప్ అనే తన పేరును 'ఏ.ఆర్.రెహమాన్'గా మార్చుకున్నాడు. రెహమాన్ పెళ్ళి ఇటీవలే 'సైరా'తో ఘనంగా జరిగింది. దక్షిణాది చిత్ర ప్రముఖులతో పాటు సుభాష్‌ఘయ్, జాకీష్రాఫ్ లాంటి హిందీ చిత్ర ప్రముఖులు కూడా విచ్చేసి రెహమాన్ దంపతుల్ని ఆశీర్వదించారు.

మౌర్య

## పరిచయం



పేరు : ఘండికోట బ్రహ్మాజీరావు
గ్రామం : పొందూరు (శ్రీకాకుళం జిల్లా)
విద్యార్హతలు: ఎం.ఏ.(ఇంగ్లీష్, తెలుగు, సంస్కృతం)
నవలలు : పరుగులిడే చక్రాలు - ప్రవహించే జీవిత వాహిని (ఆంధ్రప్రభ వారపత్రికలో రెండో బహుమతి పొందింది)
నవ్వింది నాగావళి - (ఎమెస్కో పబ్లికేషన్స్ 1992)
శ్రామిక శకటం - (ఆంధ్రజ్యోతి వారపత్రికలో మొదటి బహుమతి)
నల్లమబ్బుకో వెండి అంచు (భారతి సాహిత్య మాసపత్రికలో సీరియల్)
గులాబీ ముళ్ళు - (ఆంధ్రభూమి డైలీ సీరియల్)
అమృతవల్లి - (1995 చతుర నవలల పోటీల్లో) కన్సొలేషన్ బహుమతి.

ఇప్పటి వరకూ ప్రచురితమైన కథలు సుమారు ఇరవై వరకు ఉన్నాయి.

చిరునామా:
ఘండికోట బ్రహ్మాజీరావు,
ఇ.నం.46-18-117.
మాండావారిపేట,
దొండపర్తి, విశాఖపట్నం.